ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక
Bullet Edition
బుధవారం 9 మార్చి 2025 www.prajaasawaramdaily.com 2 pm

# సప్తగిరి ఇంట విషాదం..

## బెంగళూరులో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూసిన తల్లి చిట్టెమ్మ

## ఈరోజు తిరుపతిలో అంత్యక్రియలు



తిరుపతి : సినీ నటుడు సప్తగిరి ఇంట తీవ్ర విషాదం నెలకొంది. సప్తగిరి తల్లి చిట్టెమ్మ తుదిశ్వాస విడిచారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న చిట్టెమ్మ బెంగళూరులోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం కన్నుమూశారు. ఆమె అంత్యక్రియలు తిరుపతిలోని పద్మాపురం ఎదురుగా ఉన్న శ్రీనివాసపురంలో ఈరోజు జరగనున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. చిట్టెమ్మ భౌతికకాయానికి నివాళి అర్పించేందుకు పలువురు సినీ ప్రముఖులు రానున్నట్టు సమాచారం. సినిమాల విషయానికి వస్తే సప్తగిరి కమెడియన్ గానే కుండా హీరోగా కూడా నటిస్తున్నారు. ప్రస్తుతం ఆయన చేతిలో పలు సినిమాలు ఉన్నాయి. ఇందులో ప్రభాస్ సినిమా 'రాజాసాబ్' కూడా ఒకటి.

## ఫోన్ ట్యాపింగ్ కేసు...

# ప్రభాకర్‌రావు పాస్ పోర్టు రద్దు



హైదరాబాద్ : ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. కీలక సూత్రధారి అయినటు వంటి మాజీ ఐపీఎస్ అధికారి ప్రభాకర్ రావుకి కేంద్ర ప్రభుత్వం బిగ్ షాక్ ఇచ్చింది. ప్రభాకర్ రావు పాస్ పోర్ట్ రద్దు చేస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. ప్రభాకర్ రావు పాస్ పోర్ట్ రద్దు అయినట్లు సిటీ పోలీస్ కి కేంద్ర సర్కార్ నుంచి సమాచారం వచ్చినట్లు తెలుస్తుంది. కాగా, ఇప్పటికే రెడ్ కార్నర్ నోటీసు ప్రక్రియ మొదలైనట్లు సిటీ పోలీస్ కి సీబీఐ అధికారులు సమాచారం ఇచ్చారు. అయితే, వైద్య చికిత్స కోసం అమెరికాకు వెళ్లి అక్కడే ప్రభాకర్ రావు ఉండి పోయారు.

# గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే

## అమరావతి టు హైదరాబాద్

## కేంద్రం గ్రీన్ సిగ్నల్



అమరావతి, హైదరాబాద్ : కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం రెండు తెలుగు రాష్ట్రాలకు శుభావార్త చెప్పింది. ఏపీ, తెలంగాణ మధ్య కనెక్టివిటీని పెంచేందుకు గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మించాలని నిర్ణయించింది. హైదరాబాద్, అమరావతి మధ్య దీన్ని నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందించింది. ఇందులో భాగంగా తాజాగా రోడ్డు నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. డీపీఆర్‌లు సిద్ధం చేసి పనులు ప్రారంభించనుంది. అటు, త్వరలోనే అమరావతి రింగ్ రోడ్డు ప్రారంభం కానున్న విషయం తెలిసిందే. ఈ ఆర్‌ఆర్‌కు ఉత్తరభాగం నుంచి హైవే నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని నిర్ణయించింది. ఈ మేరకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు సమాచారం.

# మాది ఆస్తి గొడవ కాదు

## మంచు మనోజ్



హైదరాబాద్: కుటుంబ వివాదంతో నటుడు మోహన్‌బాబు కుటుంబం తాజాగా మరోసారి వార్తల్లో నిలిచింది. తన కారు పోయిందని పేర్కొంటూ మనోజ్ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఇదంతా తన సోదరుడు విష్ణు చేయిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ క్రమంలోనే బుధవారం ఉదయం జల్‌పల్లి నివాసం వద్దకు చేరుకున్న మనోజ్.. గేటు బయట బైఠాయించి నిరసన తెలియజేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. తమది ఆస్తి గొడవ కాదన్నారు. తన జుట్టు విష్ణు చేతుల్లోకి ఇచ్చేందుకు ఇలా చేస్తున్నారని ఆరోపించారు.

"నాకు ఈ ఆస్తి వద్దని నాన్నకు ఎప్పుడో చెప్పాను. ఇది ఆస్తి గొడవ కాదు. విద్యార్థుల భవిష్యత్తు కోసమే ఇదంతా. అక్కడే మొదలైంది ఈ గొడవ. డిసెంబర్ నుంచి గొడవలు జరుగుతున్నా పోలీసులు ఇప్పటివరకూ ఒక్క ఛార్జ్ షీట్ ఫైల్ చేయలేదు. కత్తులు, గన్‌లతో రౌడీలు మమ్మల్ని కొట్టడానికి వచ్చారు. దానికి సంబంధించిన సాక్ష్యాధారాలను పోలీసులకు ఇచ్చాను. ఇంట్లో నా పెంపుడు జంతువులు, ఇతర వస్తువులు ఉన్నాయి. వాటికోసమే వచ్చా" అని మనోజ్ చెప్పారు.

# తమిళిసై తండ్రి కన్నుమూత

## అనంతన్‌ను కోల్పోవడం బాధాకరం

## సీఎం రేవంత్

హైదరాబాద్ : తెలంగాణ మాజీ గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ తండ్రి తమిళనాడు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, గొప్ప సాహితీవేత్త కుమారి అనంతన్ మరణం పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. మహాత్ముడి సిద్ధాంతాలను ఉనికిపుచ్చుకున్న గొప్ప దేశ భక్తుడు, తమిళ భాషా ప్రేమికుడు, అనంతన్ ని కోల్పోవడం ఎంతో బాధాకరం అని పేర్కొన్నారు.

కాగా, కుమారి అనంతన్ నాలుగు సార్లు శాసన సభకు, ఒకసారి పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నో సేవలు అందించారని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. ఇక, తండ్రిని కోల్పోయి దుఃఖంలో ఉన్న తమిళిసై సౌందరరాజన్ కి, వారి



కుటుంబ సభ్యులకు సీఎం తన ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలియజేశారు. కుమారి అనంతన్ ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నాను అని వెల్లడించారు.

# రెపో రేటు 6 శాతం

## హోమ్, వెహికల్, పర్సనల్ రుణాలపై తగ్గనున్న వడ్డీరేట్లు

ముంబయి : భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) వరుసగా రెండోసారి కీలక వడ్డీ రేట్లను సవరించింది. రెపో రేటును 0.25 శాతం మేర తగ్గించింది. దీంతో 6.25 నుంచి 6 శాతానికి రెపో రేటు దిగొచ్చింది. ఈ మేరకు ద్రవ్య పరపతి విధాన కమిటీ నిర్ణయాలను ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా




వెల్లడించారు. దీంతో హోమ్, వెహికల్, పర్సనల్ రుణాలపై వడ్డీరేట్లు తగ్గనున్నాయి.

కాగా, ఫిబ్రవరిలోనూ వడ్డీ రేట్లను 25 బేసిస్ పాయింట్ల మేర తగ్గించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం దేశీయంగా ద్రవ్యోల్బణం నియంత్రణ దశలోనే ఉంది. 2025 ఫిబ్రవరిలో రిటైల్ ద్రవ్యోల్బణం 3.6 శాతానికి దిగొచ్చింది. ప్రధానంగా ఆహార పదార్థాల ధరలు తగ్గుముఖం పట్టడంతో రిటైల్ ద్రవ్యోల్బణం తగ్గింది. ఈ క్రమంలోనే బలహీనంగా ఉన్న ఆర్థిక వృద్ధికి ప్రాధాన్యత ఇవ్వడం కోసం వడ్డీ రేట్లను ఆర్‌బీఐ తగ్గించింది.

## ధైర్యంగా ఉండు

# లిటిల్ వారియర్

### పవన్ కుమారుడు శంకర్ గాయపడటంపై ఎన్టీఆర్ ఆవేదన

### చిన్నారి త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష




హైదరాబాద్ : పవన్ కల్యాణ్ కుమారుడు గాయపడ్డాడనే వార్త తెలిసి ఎంతో బాధపడ్డానని జూనియర్ ఎన్టీఆర్ తెలిపారు. చిన్నారి మార్క్ శంకర్ త్వరగా కోలుకోవాలని ఎక్స్ వేదికగా తారక్ ఆకాంక్షించారు. 'ధైర్యంగా ఉండు లిటిల్ వారియర్' అని పోస్ట్ పెట్టారు.

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిన్న కుమారుడు మార్క్ శంకర్ సింగపూర్ లోని స్కూల్లో చోటుచేసుకున్న అగ్నిప్రమాదంలో గాయపడ్డ సంగతి తెలిసిందే. చిన్నారి కాళ్లకు, చేతులకు గాయాలయ్యాయి. మార్క్ ఊపిరితిత్తుల్లోకి పొగ పోయింది. ప్రస్తుతం సింగపూర్ లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మార్క్ శంకర్ త్వరగా కోలుకోవాలని సినీ, రాజకీయ ప్రముఖులు కోరుకుంటున్నారు.

# విచారణకు బీఆర్ఎస్ నేతలు

## హెచ్ సీయూ భూముల వివాదం..





హైదరాబాద్ : హైదరాబాద్ నగరంలోని కంచె గచ్చిబౌలి భూముల వివాదంపై గచ్చిబౌలి పోలీస్ స్టేషన్లలో విచారణకు బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్, కొణతం దిలీప్ హాజరయ్యారు. ఈసందర్భంగా హెచ్ సీయూ భూముల విషయంలో తప్పుడు పోస్టులు పోస్ట్ చెయ్యడంతో పోలీసులు కేసులు నమోదు చేశారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఉపయోగించి ఫేక్ వీడియోలు ప్రచారం చేశారని గచ్చిబౌలి పోలీసులు నోటీసులు ఇచ్చారు

## రేవంత్ తప్పుడు కేసులు పెట్టారని

# భట్టి చెప్పినట్టే కదా?

### విద్యార్థులకు సీఎం క్షమాపణ చెప్పాలి

### మాజీ మంత్రి హరీశ్ రావు

సంగారెడ్డి: తెలంగాణను కేసీఆర్ నిలబెట్టారు.. రేవంత్‌రెడ్డి పడగొట్టారని ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. సంగారెడ్డిలోని గణేశ్ గడ్డ సిద్ధి వినాయక ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. బీసీ సభకు రాహుల్ గాంధీ దిల్లీలో ఉండి కూడా వెళ్లలేదని అన్నారు. విద్యార్థులపై పెట్టిన కేసులు డిప్యూటీ సీఎం ఉపసంహరించుకున్నారని చెప్పారు. అంటే రేవంత్‌రెడ్డి తప్పుడు కేసులు పెట్టారని భట్టి విక్రమార్క చెప్పినట్టే కదా అని ప్రశ్నించారు.



"అక్రమ కేసులు పెట్టినందుకు రేవంత్‌రెడ్డి విద్యార్థులకు క్షమాపణ చెప్పాలి. తెలంగాణ అంతా కేసీఆర్ వైపు చూస్తోంది. ఏడాది పాలనలో ప్రజలకు అన్నీ అర్థం అయ్యాయి." అని హరీశ్‌రావు తెలిపారు.